
ప్రజాశక్తి
శుక్రవారం 18 అక్టోబర్ 2024 5
పార్వతీపురం మన్యం



21న పార్వతీపురంలో మెగా జాబ్‌మేళా

పార్వతీపురం : ఈ నెల 21న స్థానిక ఎస్‌విడి కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, ఎంబిఎ చదువుకొని 18 నుండి 30 ఏళ్లలోపు నిరుద్యోగ యువత సోమవారం ఉదయం 9గంటల ఎస్‌విడిలో మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ యువకులు తమ వివరాలను https://skilluni-verse.apssdc.in వెబ్ సైట్ నందు తప్పనిసరిగా నమోదు చేసుకొని, రిఫరెన్స్ నెంబర్‌తో పాటు బయో డేటా, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు ఒరిజినల్, జెరాక్స్, ఒక పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోతో హాజరు కావలసినదిగా కోరారు. మరిన్ని వివరాలకు 6305110947, 8978878557 నందు సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు.

అవే బ్రాండ్లు... అవే ధరలు

- మందుబాబులను వదలని ధరల కిక్కు
- నూతన పాలసీ వచ్చినా పాత రేట్లతోనే విక్రయాలు
- అందుబాటులోకి రాని నాణ్యమైన మద్యం

ప్రజాశక్తి - కురుపాం

ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగానే కూటమి సర్కార్ పాత మద్యం పాలసీని రద్దు చేసి కొత్త మద్యం విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ఈ షాపులు దక్కించుకునేందుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. లాటరీ ద్వారా షాపుల కేటాయింపు కూడా జరిగింది. బుధవారం నుంచి కొత్త షాపులు ప్రారంభమయ్యాయి. గతంలో చంద్రబాబు హామీ ఇచ్చినట్లుగా అన్ని రకాల నాణ్యత గల బ్రాండ్లు అందుబాటులో ఉంటాయని, ధరలు తగ్గుతాయని ఆశించిన మందుబాబులు భంగపాటుకు గురయ్యారు. తమకు నచ్చిన బ్రాండ్లు కోసం ఎదురు చూసిన మద్యం ప్రియులు నిరాశకు గురయ్యారు. 2019 నుంచి నిన్న, మొన్నటి వరకూ దొరికిన బ్రాండ్లే కొత్త మద్యం పాలసీ వచ్చిన తర్వాత కూడా అదే మద్యం దొరుకుతుండడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా మద్యం ధరలు భారీగా తగ్గుతాయని చంద్రబాబు ప్రకటించినప్పటికీ పాత ధరలే అమలవుతున్నాయి. కూటమి ప్రభుత్వం కొత్త పాలసీలో భాగంగా కురుపాం ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాజాగా కొన్ని షాప్‌లు



విక్రయాలు ప్రారంభమయ్యాయి. మద్యపాన నియంత్రణ పేరుతో వైసిపి ప్రభుత్వం మద్యం షాపులను ప్రభుత్వమే నిర్వహించేలా పాలసీను అమలు చేసింది. ధరలను భారీగా పెంచి విక్రయించింది. క్రమంగా మద్యాన్ని దూరం చేయాలనే ఆలోచనలో భాగంగానే ధరలు పెంచామంటూ చెప్పొకొచ్చింది. చాలా వరకూ పాత బ్రాండ్లను పూర్తిగా పక్కన పెట్టి కొత్త బ్రాండ్లను తీసుకొచ్చి విక్రయాలు జరిపింది. నాసిరకం బ్రాండ్లపై మందుబాబుల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఈ నేపథ్యంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రబాబు వైసిపి అమలు చేసిన మద్యం పాలసీని తీవ్రస్థాయిలో విమర్శించారు. మందు బాబులను అడ్డుకునే పనిలో భాగంగా తాము అధికారంలోకిచ్చిన వెంటనే నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని చెప్పారు. అనుకున్నట్టే నూతన మద్యం పాలసీని తీసుకొచ్చి ప్రయివేటు దుకాణాలు ఏర్పాటు చేయించారు.

ఈ నేపథ్యంలో కురుపాంలో ప్రభుత్వం నడిపే వైన్ షాపుల్లో ఉన్న మద్యాన్ని కొత్తగా మంజూరైన షాపులకు మద్యం సరఫరా అందించారు. తీరా చూస్తే నాణ్యమైన మద్యం గానీ, అన్ని రకాల బ్రాండ్లు అందుబాటులోకి రాకపోవడంతో వ్యాపారులు కంగుతిన్నారు. పైగా పాత ధరలకే మద్యం విక్రయించాలని ప్రభుత్వం చెబుతోంది. ఈ నేపథ్యంలో మద్యం ధరలు తగ్గాయనుకుని దుకాణాలకు వస్తున్న వారికి నిరాశ తప్పలేదు. మద్యం ధరల్లో ఎలాంటి మార్పు లేకపోవడంతో పలు చోట్ల విక్రేతలతో వాగ్వివాదానికి దిగుతున్నారు. రూ.99కే మద్యం ఎక్కడా అందుబాటులోకి రాలేదు. రూ.130 కనీస ధర ఉన్న రకమే చాలా చోట్ల విక్రయించారు. మద్యం వ్యాపారులకు 20 శాతం మార్జిన్ ఇస్తున్నట్లు మాత్రం ప్రభుత్వం చెబుతోంది. ఆ మేరకు విక్రయాలు సైతం జరుగుతున్నాయి. అయితే పాత ధరలు, పాత బ్రాండ్లు ఎప్పటి వరకూ కొనసాగుతాయనేది ప్రస్తుతానికి స్పష్టత లేదు. ఈ నెలాఖరు వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలు, కిశోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సిడిపిఒలను ఆదేశించారు. రక్తహీనత నివారణ పట్ల ప్రత్యేక దృష్టి సారించి, అవసరమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అవసరమైతే ప్రభుత్వం అనుమతి పొందిన ఇంజక్షన్లు కూడా ఇప్పిస్తామని చెప్పారు. ప్రతి గర్భిణీకి ఒక కార్డు ఇవ్వాలని, ఆమె క్రమం తప్పకుండా తీసుకుంటున్న వాటిని ఆ కార్డులో నమోదు చేయాలన్నారు. గర్భిణీలు రక్తహీనతతో ప్రాణాపాయ పరిస్థితి రాకుండా చూడాల్సిన బాధ్యత సిడిపిఒలదేనని కలెక్టర్ తేల్చి చెప్పారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లోని పిల్లలకు సరైన పౌష్టికాహారం అందించడంతో పాటు, వయసుకు తగిన బరువు, ఎత్తు పెరిగేలా చూడాల్సిన బాధ్యత కూడా సంబంధిత సిడిపిఒలదేనని సూచించారు. గురువారం స్థానిక కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో మహిళా, శిశు సంక్షేమ అధికారులు, సిడిపిఒలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల్లో వయసుకు తగిన బరువు, ఎత్తు ఉండాలని, అందుకు తగిన పోషక ఆహారాన్ని అందించాలని అన్నారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు జిల్లాయంత్రాంగం తరపున అందిస్తామని, అప్పటికీ ఫలితాలు కనిపించక పోతే సంబంధిత సిడిపిఒలపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పిల్లల్లో బరువు, ఎత్తు, కొలతలను ప్రతివారం రిజిష్టరులో నమోదు చేయాలని, బరువు,ఎత్తు తక్కువుగా ఉన్న వారికి డబుల్ మిల్క్,ఎగ్స్ ఇవ్వాలని సూచించారు. కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద సొంత భవనాలు కలిగిన అంగన్వాడీ కేంద్రాలకు పెయింటింగ్స్, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర మౌలిక వసతులు కల్పిస్తామని తెలిపారు. ముందుగా ఒక ఆదర్శ అంగన్వాడీ కేంద్రాన్ని తీర్చిదిద్దనున్నట్లు చెప్పారు. కొత్త భవనల కోసం స్థల సేకరణ చేసి, ప్రతిపాదనలు సమర్పిస్తే, వాటిని పరిశీలిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. పుట్టిన పిల్లాడు తల్లి తర్వాత చేరేది అంగన్వాడీ కేంద్రానికేనని, అటువంటి కేంద్రాలు అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని అన్నారు. ఇందుకోసం బాగాలేని కేంద్రాలకు వైట్ వాష్ వేయించాలని, గోడలకు చిత్ర లేఖనం వేయించాలని అన్నారు. పిల్లలంతా హాజరయ్యేలా చూడాలని, వారు హాజరైనట్లుగా హాజరుపట్టీలో నమోదు కావాలని చెప్పారు. హాజరైన పిల్లలకు తగిన పోషకాహారం, విద్యను అందించడంతో పాటు , ఇతర



ఐసిడిఎస్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కార్యక్రమాలపై అవగాహన పెంచాలని అన్నారు. ముఖ్యంగా భోజనం ముందు, తదుపరి చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవడం, కేంద్రానికి వచ్చే ముందు శుభ్రంగా తయారై రావడం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవ మర్యాదలు వంటివి నేర్పాలని అన్నారు. నెలలో మూడో శనివారం ప్రతి అంగన్వాడీ కేంద్రంలో పరిశుభ్రత కార్యక్రమం చేపట్టాలని చెప్పారు. అందుబాటులో ఉన్న స్థలాభావాన్ని బట్టి ఆకు, కూరగాయలు వంటివి పండించాలని చెప్పారు. వాటిని ఆహారంలోకి వినియోగించాలని సిడిపిఒలను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పాతబడిన చార్టులు, ఆట పరికరాలను తీసివేసి, వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, వాటిని కనిపించేలా ఉంచాలని అన్నారు. అలాగే పిల్లల కోసం టైం టేబుల్ తప్పనిసరి అని, ఆ విధంగా కొనసాగాలని స్పష్టం చేశారు. పిల్లలకు చదువుతో పాటు చార్ధులు, కలర్ పెన్సిళ్లు ఇచ్చి పెయింటింగ్స్ వంటివి వేసేలా ప్రోత్సహించాలని చెప్పారు. వీటికి అవసరమయ్యే నిధులను సమకూరుస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ప్రతి సిడిపిఒ, సూపర్ వైజర్లు బాధ్యతగా వ్యవహరించి అంగన్వాడీ కేంద్రాలను అందంగా తీర్చిదిద్దడంతో పాటు గర్భిణీలు, పిల్లల్లో రక్తహీనత లేకుండా నివారణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పిడి ఎంఎన్ రాణి, అన్నిమండలాల సిడిపిఒలు, సూపర్ వైజర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



డిఇఒ కార్యాలయం వ్ద ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

మున్సిపల్ ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - పార్వతీపురం

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం యుటిఎఫ్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు డిఇఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు తోట రమేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు ఆధ్వర్యాన ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు పిఎఫ్ సౌకర్యం కల్పించాలని, బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. అర్బన్ ఎంఇఒలను నియమించాలని, నాన్ టీచింగ్ స్టాఫ్ నియమించాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే ఈనెల 24న స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, భాస్కరరావు, చిన్నారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాకేష్ మృతికి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

కలెక్టర్‌కు తల్లిదండ్రుల వినతి

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

పోలీసుల అదుపులో ఉన్న తమ కుమారుడు రైలు పట్టాలపై శవంగా మారిన సంఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అనుమానాస్పదంగా మృతి చెందిన యువకుడు కర్రి రాకేష్ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ను కలిసి వినతి అందించారు. ఫోక్సో కేసులో పోలీసుల అదుపులో ఉన్న రాకేష్ స్టేషన్ నుంచి తప్పించుకొని రైలు కిందపడి మరణించిన సంఘటనలో పోలీసుల వైఖరిని నిరసిస్తూ,బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం నుంచి పోస్టుమార్టానికి సహకరించకుండా నిరసన వ్యక్తం చేశారు. గ్రామ పెద్దల సలహా మేరకు గురువారం కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌ను కలిసి పోలీసుల వైఖరిపై ఫిర్యాదు చేశారు. పోలీసుల అదుపులో ఉన్న తమ కుమారుడు పరారీపైనా, అతడి శరీరంపై దెబ్బలు ఉండడంపైనా అనుమానం వ్యక్తం చేశారు. దీనికి స్పందించిన కలెక్టర్ వెంటనే ఎస్పీ మాధవరెడ్డితో ఫోన్లో మాట్లాడి సంఘటనపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. దీనికి ఎస్పీ సానుకూలంగా స్పందించి తప్పకుండా ఈ ఘటనపై శాఖాపరమైన విచారణ జరుపుతామని, బాధ్యులు ఎవరైనా సరే వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో మృతుడి కుటుంబీకులు, గ్రామస్తులు పోస్టుమార్టానికి అంగీకరించారు. పోస్టుమార్టం అనంతరం



కలెక్టర్‌కు వినతిని అందజేస్తున్న రాకేష్ తల్లిదండ్రులు

అశ్రునయనాల మధ్య దహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీసు అదుపులో ఉన్న వ్యక్తి బయటకు వెళ్లేందుకు జరిగిన సంఘటనపై జిల్లా పోలీసు అధికారులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇందుకు కారణమైన వారిపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు ఉంటాయని భావిస్తున్నారు.

స్వచ్ఛ సుందర పట్టణంగా పార్వతీపురం

ప్రజాశక్తి -పార్వతీపురం

స్వచ్ఛ సుందర పట్టణంగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దేందుకు ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెకర్ ఎ.శ్యామ్ ప్రసాద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్వచ్ఛ సుందర పార్వతీపురంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురం పట్టణ ప్రాంతంలో డంపింగ్ యార్డ్ సమస్య లేకుండా తడి, పొడి చెత్తలను వేరు చేసి సేకరించాలని, తద్వారా క్లీన్ సిటీ చేయాలని అన్నారు. ప్లాస్టిక్ సంచులను నిషేధిస్తూ, వాటిని విక్రయించే, వినియోగించే షాపు యాజమాన్యాలతో చర్చించి, ప్రత్యామ్నాయం ఏర్పాట్లు చేయాలని తెలిపారు. మట్టి పాత్రలు, పేపర్ గ్లాసులను ప్రోత్సహించాలని సూచించారు. పార్కులను సుందరంగా తీర్చిదిద్దడం, అందమైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి, వాటికి విద్యుత్ కాంతులను ఏర్పాటు వంటి చర్యలు చేపట్టాలని చెప్పారు. పట్టణానికి వచ్చే ప్రజల కోసం సుందరమైన స్వాగత ద్వారం ఉండాలని, ఆ దిశగా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేయాలన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో అందరూ భాగస్వాములు కావాలని, ఇందుకోసం కరపత్రాలను ముద్రించి, ప్రజల్లో అవగాహనా పెంచాలని అన్నారు. అలాగే స్వచ్ఛంద సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ సూచించారు. వచ్చే సమావేశానికి తగిన ప్రణాళికలతో సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఇన్చార్జ్ మున్సిపల్ కమిషనర్ సన్యాసిరావు, మున్సిపల్ ఈ ఈ వంశీ క్రిష్ణ ,డి ఈ కిరణ్ కుమార్, సానిటేషన్ ఇన్స్పెక్టర్ ఫకీర్ రాజు, జట్టు ఆశ్రమం చైర్మన్ పద్మావతి, జట్టు ఆశ్రమం సభ్యులు, విద్యాశాఖ ఎపి శంకర్ , తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలి : డిఎంహెచ్ఒ

ప్రజాశక్తి - కొమరాడ

ప్రజలకు ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. విజయపార్వతి సూచించారు. మండలంలోని కెఆర్‌బి పురం, కొమరాడ పిహెచ్‌లను, ఎస్ఎం పురంలో ఎఫ్‌డిపి వైద్య శిబిరాన్ని గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సిలో రికార్డులు తనిఖీ చేసి హాజరు నమోదు పరిశీలించారు. జ్వరాలు, సీజనల్ వ్యాధులతో ఆసుపత్రికి వస్తున్న వారికి అందజేస్తున్న చికిత్స వివరాలపై ఆరా తీసి అనారోగ్య లక్షణాలు ఉన్న వారిని వార్డులో ఉంచి చికిత్స అందించాలన్నారు. ల్యాబ్‌లో నిర్ధారణ పరీక్షలు, వాటి నివేదికలు పరిశీలించి మలేరియా నిర్ధారణ అయిన వారికి తక్షణమే చికిత్స అందజేయాల న్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు ఆరోగ్య సర్వే చేపట్టి మలేరియా, డెంగీ, డయేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా



రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ విజయపార్వతి

అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. లేబర్ రూం, కాన్పుల రిజిస్టర్ పరిశీలించారు. పిహెచ్‌సిలో ప్రసవాల సంఖ్య మెరుగు పడాలన్నారు. సాయంత్రం, రాత్రి వేళల్లో షిఫ్ట్ డ్యూటీ సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులకు ఐరన్ ఫోలిక్ ఆసిడ్ మాత్రలను మింగించారు. కిషోర బాలికల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. ఎస్ఎం పురంలో ఎఫ్డీపీ వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఒ తనిఖీ చేసి అక్కడ నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, రక్త పరీక్షలు పరిశీలించారు. గర్భిణులతో మాట్లాడి తగు జాగ్రత్తలు తెలిపారు. గ్రామాల్లో తాగునీటి స్వచ్ఛత పరీక్షలు ప్రతి వారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, వైద్యాధికారులు సిహెచ్ అరుణ్ కుమార్, బి.శామ్యూల్, జి.గణేష్, శిరీష, ప్రిన్సిపాల్ పద్మావతి, డెమో యోగీశ్వరరెడ్డి, సూపర్వైజర్స్ బంగారుబాబు, విజయకుమారి, వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

'ఉల్లాస్' లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్ కార్యక్రమం కింద ఇచ్చిన లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వయోజన విద్య నోడల్ అధికారిను ఆదేశించారు. జిల్లాలో 23 వేల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. ఇందుకోసం మండల, జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇచ్చిన లక్ష్యాలలో అన్ని మండలాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని సూచించారు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే వారికి ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రచురించబడే పుస్తకాలు మండల, జిల్లాస్థాయిలో సరఫరా చేయబడతాయని, అందులోని పాఠాలను నిరక్షరాస్యులకు బోధించి, ప్రాథమిక అవగాహన పెంచాలని కలెక్టర్ హితవు పలికారు. జిల్లాలో 53 శాతంగా ఉన్న అక్షరాస్యత, ఈ కార్యక్రమం ద్వారా మరింత పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా అవగాహన పెంచుకున్న వారందరికీ చివరి రోజున సర్టిఫికెట్, పతకాలు వంటివి బహూకరించి ప్రోత్సాహించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వయోజన విద్య నోడల్ అధికారి టి.వైకుంఠరావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు వై. సత్యం నాయుడు, రామచంద్రరావు, సిడిపిఒశ్రీనివాస్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో పిఒ ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని అనసభద్రలో గల ఏకలవ్య ఆదర్శ వసతి పాఠశాలను ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. నిర్మాణ దశలో ఉన్న పనులను పరిశీలించి, పనులు త్వరగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. వంట గదిని తనిఖీ చేసి, ఆహార నాణ్యత ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యా ప్రమాణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్న ఆయన విద్యార్థులకు అందించే భోజన సదుపాయాలు, నాణ్యత ప్రమాణాలు, మెనూ ప్రకారం అందిస్తున్న ఆహారం గురించి ఆరా తీశారు. మంచి విద్య, ఆహారం అందిస్తున్నట్లు విద్యార్థులు తెలియజేయడంతో పిఒ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అదే గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసి విద్యార్థుల విద్య, ఆహారం నాణ్యతా ప్రమాణాలను స్వయంగా



విద్యార్థితో మాట్లాడుతున్న పిఒ అశుతోష్ శ్రీవాత్సవ

పరిశీలించి సంతృప్తి చెందారు. ఈ పర్యటనలో గిరిజన సంక్షేమ అధికారులు, ఉపాధ్యాయులు, ఇంజినీరింగ్,ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

21న సీతంపేటలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 21న (సోమవారం) స్థానిక ఐటిడిఎలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆధ్వర్యాన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) జరగనుందని ఐటిడిఎ పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎలోని ఎస్ఆర్ శంకరన్ మీటింగ్ హాల్లో ప్రారంభమవుతుందని తెలిపారు. కావున ఐటిడిఎ పరిధిలోని గిరిజన ప్రజలు తమ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కువినతులు సమర్పించుకోవచ్చని తెలిపారు. అలాగే ఈ కార్యక్రమానికి ఐటిడిఎకు సంబంధించిన అన్ని శాఖల డివిజన్ స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని పిఒ ఆదేశించారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు గురువారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఘనంగా జరిగాయి. జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ వాల్మీకి చిత్ర పటానికి పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళు లు అర్పించారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డిఆర్ఒ జి.కేశవనాయుడు, సహాయ బిసి సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, ఇతర అధికారులు భాగస్వాములై వాల్మీకి చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించి, నివాళులు అర్పించారు.

పార్వతీపురం రూరల్ : స్థానిక జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఎస్పీ మాధవరెడ్డి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎఎస్‌పి ఒ.దిలీప్ కిరణ్, ఎఆర్ డిఎస్‌పి ఎస్.వెంకట అప్పారావు, ఆర్‌ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, ఎస్‌ఐలు, ఆర్ఎస్ఐ లు, జిల్లా ఆర్మడ్, స్పెషల్ బ్రాంచ్, డి.సి.ఆర్.బి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎలో ఆదికవి వాల్మీకి మహర్షి జయంతిని పిఒ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్బంగా పిఒ వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎపిఒ జి.చిన్నబాబు, ఎఎంఒ కోటిబాబు, సిఎంఒ చిరంజీవులు, జిసిడిఒ రాములమ్మ, జిసిసి మేనేజర్లు నర్సింహులు, కృష్ణ, ఉపాధిహామీ ఎపిడి శ్రీహరి, ఇతర ఐటిడిఎ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వాల్మీకికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జెసి శోభిక

డిగ్రీ కళాశాలలో...

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాల్మీకి జయంతి నిర్వహించారు. అతని జ్ఞానం బోధనలు మార్గాన్ని సన్మార్గంలో నడిపిస్తాయని, నిత్యజీవితంలో నీతి నియమాలు పాటించాలని అన్నారు. కార్యక్రమంలో బోధకులు శంకరరావు ప్రభాకర్ రావు తదితరులు ఉన్నారు.

వీరఘట్టం : స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ బి.వెంకటరమణ వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సీనియర్, జూనియర్ సహాయకులు వి.శ్రీనివాస్, ఎ.శ్రీకాంత్‌తో పాటు ఉమా, కిషోర్, రాజు, గోవింద, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన భూముల ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలోని రావికోన పంచాయతీ పరిధిలో గిరిజన రైతులు సాగు చేసుకుంటున్న భూములను ఆక్రమించుకున్న ప్రైవేటు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డిఆర్ఒ జి.కేశవ నాయుడుకు వినతిని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రావికోన నుండి చినమరికి వెళ్లే దారిని అనుసరించి గిరిజనులకు చెందిన సుమారు 30 ఎకరాల పట్టా భూములను అగినేంద్రపు ఫకీరు రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై వన్ బిలో తన పేరిట మార్చుకొని భూములను కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాడని అన్నారు. ఈ విషయంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, పట్టా ఉన్న భూములకు అక్రమంగా వన్ బి అడంగుల్లలో పేర్లు చేర్చి అవినీతికి పాల్పడిన విషయాన్ని బయట పెట్టాలని, సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై జిల్లా రెవెన్యూ యంత్రాంగం దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు లేవని, ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టకపోతే గిరిజనులతో కలిసి ఆందోళనకు సిద్ధమవుతామని ఆయన అన్నారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రావికోన సర్పంచి కె రామస్వామి తదితరులు ఉన్నారు.

ముంపు బాధితులకు నష్టపరిహారం చెల్లించండి

మండలంలో ప్రతి ఏటా చెరువు ముంపు వల్ల నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు డిఆర్ఒకు



డిఆర్ఒకు వినతిని అందజేస్తున్న కృష్ణమూర్తి, రైతులు

వినతి అందించారు. అనంతరం కృష్ణమూర్తి మాట్లాడుతూ మండలంలోని అంటివలస రెవెన్యూ పరిధిలో గల కాసన్న చెరువులో నీరు నిండినప్పుడు జమ్మిడివలస, అంటి వలస రెవెన్యూలో గల భూములు ముంపునకు గురవుతున్నాయన్నారు. దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రతి ఏటా ఇదే పరిస్థితిని రైతులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కావున జిల్లా రెవెన్యూ అధికారులు సమస్యను గుర్తించి పరిష్కరించవలసిందిగా కోరారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం రైతులకు నష్టపరహారం చెల్లించాల్సిందిగా కోరారు. ఈ విషయంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిఆర్ఒను కోరారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

మంత్రి దృష్టికి ఇరిగేషన్ సమస్యలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి వెలగపూడి సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ఇరిగేషన్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా మినీ రిజర్వాయర్లు, చెక్ డాంల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.


మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

పప్పు దినుసుల విత్తనాలకే దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - బలిజిపేట

పప్పు దినుసులు విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు గురువారం ఆయన విలేకరులతో తన కార్యాలయంలో మాట్లాడారు. రైతు సేవా కేంద్రాల్లో పెసలు, మినువులు విత్తనాలు కావాల్సిన రైతులు ముందస్తుగా ఆయా గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద డి -కృషిలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకొని నగదు చెల్లించని పక్షంలో రైతు సేవా కేంద్రంలో విత్తనాలు పెట్టడం జరుగుతుందని, కావున అపరాలు, విత్తనాలు కావాల్సిన రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. మినువులు కిలో పూర్తి ధర రూ 140 కాగా, సబ్సిడీపై రూ.42.98, పెసలు కిలో రూ.130 కాగా, సబ్సిడీపై రూ.39.91 రైతుల చెల్లించాలని, చెల్లించిన వారం రోజుల్లో పూర్తిస్థాయిలో విత్తనాలు అందజేస్తామని తెలిపారు. ముందస్తుగా విత్తనాలు కావాల్సిన రైతులు రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేసుకొని నగదు చెల్లింపు చేసి రశీదు పొందాలని ఆయన కోరారు.



ఆర్‌బికె భవనంపై ఉన్న మాజీ సిఎం జగన్ ఫొటో

ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతర్

ప్రజాశక్తి -వీరఘట్టం

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇటీవల కాలంలో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ మండల స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ క్లినిక్ భవనాలపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటాలు గాని, రంగులు గాని ఉన్నట్లయితే తక్షణమే వాటిని తొలగించాలని అధికారులకు హుకుం జారీ చేశారు. అయినా అధికారులు ఎమ్మెల్యే ఆదేశాలు బేఖాతరు చేశారు. మండలంలోని కత్తుల కవిటిలోని రైతు భరోసా కేంద్ర భవనంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖచిత్రం అద్దం పట్టినట్టు దర్శనమిస్తున్న అధికారులకు కనిపించలేదా ?అంటూ స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. సాక్ష్యాత్తూ ఎమ్మెల్యే ఆదేశాలను పట్టించుకోకపోతే, ఇక సామాన్యుల మాటలను వీరు ఇంకేమైనా వింటారనని చర్చించుకుంటున్నారు.

'జ్ఞాన ప్రకాశ్' శిక్షణ జిల్లాలోనే నిర్వహించాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు నిర్వహించే జ్ఞానప్రకాశ్ శిక్షణా కార్యక్రమాన్ని ఇతర జిల్లాల్లో కాకుండా పార్వతీపురం మన్యం జిల్లాలోనే నిర్వహించాలని పిఆర్‌టియు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు అమరాపు సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ 1,2 తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఎఫ్ఎల్ఎన్ జ్ఞాన్‌ప్రకాష్‌లో భాగంగా ఇస్తున్న ఆరు రోజులు శిక్షణ విజయనగరం జిల్లా మోదవలస తదితర ప్రాంతాల్లో నిర్వహించడం వల్ల అధిక శ్రమకు గురవుతున్నారని, కావున పార్వతీపురం మన్యం జిల్లాలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిఆర్‌టియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వాలేటి తవిటి నాయుడు, కాగాన విజయ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గంట శశి కుమార్, జిల్లా అసోసియేట్ అధ్యక్షులు భోగి రవికుమార్ పాల్గొన్నారు.

వీరఘట్టంలో వర్షం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలో గురువారం ఉరుములు , మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఉదయం 10 గంటల వరకు ఎండ తీవ్రత అధికంగా ఉన్నప్పటికీ ఆకాశంలో ఒక్కసారి నల్లటి మబ్బులు ఏర్పడి వర్షం కురిసింది. గత కొన్ని రోజుల నుంచి ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ పై భాగం ఉన్న పంట పొలాలు ఎండిపోవడంతో ఈ వర్షం కురవడం వల్ల వరి పంటకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎండిపోయే స్థితిలో ఉన్న వరి పైరు చూసి అన్నదాతలు కంటతడి పెడుతున్న తరుణంలో అకాలంగా వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం

అంగన్‌వాడీ భవనం నిర్మించాలి

ప్రజాశక్తి - పాచిపెంట

మండలంలోని ఆజూరులో శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం స్థానంలో కొత్త భవనం మంజూరు చేయాలని సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం ఆయన శిథిలమైన అంగన్‌వాడీ భవనాన్ని పరిశీలించారు. ఈ కేంద్రంలో పిల్లలు ఎక్కువగా ఉండడం, భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో తమ పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. ప్రభుత్వం వెంటనే కొత్త భవనం మంజూరు చేయాలని కోరారు. అలాగే ఆ గ్రామ సర్పంచి సుందరరావు కూడా వెంటనే కొత్త అంగన్వాడీ బిల్డింగు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి -సీతానగరం

మండలంలోని చినబోగిలికి చెందిన మర్రాపు శంకరరావు, లక్ష్మీపురానికి చెందిన సప్ప సింహాచలం విశ్రాంతి ఉపాధ్యాయులకు బొబ్బిలి ఎమ్మెల్యే బేబి నాయనా బొబ్బిలిలో సన్మానిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యా యులు సమాజానికి సేవలు చేసి మెరుగైన సమాజాన్ని తీర్చిదిద్దేందుకు వారు కృషి చేయాలన్నారు. వీరితో పాటు మరో 10 మంది ఉపాధ్యా యులను సన్మానించారు. కార్యక్రమంలో విశ్రాంతి ఉపాధ్యాయ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


విశ్రాంత ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

పాలధర తగ్గింపుపై రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

పాల సేకరణ ధర గణనీయంగా తగ్గించినందున మండలంలోని వెంకంపేట విశాఖ డైయిరీ బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్‌కు పాలు అందిస్తున్న పాడి రైతులు గురువారం పాల సేకరణ కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు మాట్లాడుతూ ఈనెల 16 నుంచి అకస్మాత్తుగా విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరను లీటరుకు ఐదు రూపాయలు తగ్గిస్తున్నట్లు ప్రకటించిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పశువుల దాణా ధర బస్తా ఒక్కంటికి రూ.300 పెంచడమే కాకుండా, ప్రతి ఏటా పాడి రైతులకు అందించే బోనస్‌లో కూడా తీవ్రమైన కోతను విధించారని, ఇన్ని రకాల నష్టాలను భరిస్తున్న పాడి రైతులకు పాల సేకరణ ధరను లీటర్ ఒక్కంటికి ఐదు రూపాయలు తగ్గించడం వల్ల తీవ్రంగా నష్టపోతామని, కనుక డెయిరీ యాజమాన్యం ఈ విషయంలో పునరాలోచించి ధరను స్థిరీకరణ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక విశాఖ డెయిరీ బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ నుంచి పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి మండలాల నుంచి 60 కేంద్రాల ద్వారా రైతులు సుమారు 10వేల లీటర్లు రోజుకు అందిస్తుంటారని, దీనివల్ల రైతులపై తీవ్రమైన ఆర్థిక ప్రభావం చూపిస్తుందని అన్నారు. కావున ఈ విషయంపై ప్రభుత్వం స్పందించి పాడి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల ఉత్పత్తిదారుల సంఘం నాయకులు తాన శంకర్రావు, చుక్క శ్రీరాములు, బంకపల్లి సింహాచలం, పడాల రవి, బి.సింహాచలం ఎన్ వెంకట నాయుడు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న పాడి రైతు

దుగ్గేరులో పిహెచ్‌సి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని గిరిజన ప్రాంతం దుగ్గేరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేసి గిరిజన ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి తేవాలని, మక్కువ మండల కేంద్రంలో గిరిజన బాల బాలికల ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. సిపిఎం శాఖ మహాసభల సందర్భంగా దుగ్గేరులో సిపిఎం జెండాను సీనియర్ సభ్యులు మండ లక్ష్మణ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం శాఖ కార్యదర్శి కొండ గొర్రె ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఇటీవల మతి చెందిన సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వి.ఇందిర, కార్యవర్గ ఎన్ వై నాయుడు మాట్లాడారు. మంత్రి హామీ ప్రకారం ప్రతి ఆశ్రమ పాఠశాలకు ఎఎన్ఎంను నియమించాలని డిమాండ్ చేశారు. పై సమస్యలపై మహాసభల్లో తీర్మానాలు ఆమోదిస్తున్నామని ప్రభుత్వం స్పందించి పరిష్కరించుకుంటే భవిష్యత్తులో ప్రజలందరినీ కలుపుకొని పోరాటాలు చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కె.శ్రీను, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : మండలంలోని కరడవలస నుంచి జిల్లేడు వలస వరకు రోడ్డు సౌకర్యం కల్పించాలని సిపిఎం నాయకులు కోరాడ ఈశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని బొడ్డపాడు, నారింజపాడులో సిపిఎం శాఖా మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా గిరిజన గ్రామాలకు కనీస మౌలికసౌకర్యాలు కల్పించాలని అనేక పోరాటాల ఫలితంగా రోడ్డవలస నుండి కరడవలస వరకు రోడ్డు నిర్మాణం చేపట్టి చేతులు దులేపిసుకున్నారని అన్నారు. జిల్లేడు వలస నుండి పడాలవలస వరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని, మరిపల్లె పంచాయతీ వెలగవలస వద్ద నిర్మాణంలో ఉన్న వంతెనను పూర్తి చేయాలని కోరారు. కరడవలస-బి.కొత్తూరుకు రోడ్డు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు ప్రధానమైన సమస్యలను పరిష్కరించాలి అని లేని యెడల సిపిఎం పార్టీ తరుపున పోరాడుతామని హెచ్చరించారు. మహాసభలో సిపిఎం సాలూరు మండల కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు సీదరపు అప్పారావు, మోహన్‌రావు, శంకరరావు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. తొలుత సిపిఎం జెండా నాయకులు సీదరపు అప్పారావు ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు.

సిపిఎం జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు



ఎస్ఐకు వినతిని అందజేస్తున్న సిపిఎం నాయకులు

రద్దీ ప్రాంతాల్లో షాపులను తొలగించండి

ప్రజాశక్తి - బలిజిపేట

నిరంతరం రద్దీగా ఉండే ప్రాంతంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సిపిఎం నాయకులు ఆర్ఐ, ఎస్ఐకు గురువారం వినతిని అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వై.మన్మధరావు, గేదెల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా మద్యం దుకాణాలను పెట్టడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. 100 మీటర్ల దూరంలో సత్య సాయి బాబా మందిరం గుడి ఉందని, 50 మీటర్ల దూరంలో యూనియన్ బ్యాంకు, నారాయణపురం ఆటో స్టాండ్, బస్ స్టాప్‌లు ఉన్నాయన్నారు. నిరంతరం విద్యార్థులు స్కూలుకు, కాలేజీకి వెళ్లే ప్రాంతమని, అటువంటి ప్రాంతంలో ఇలా మద్యం దుకాణాలు పక్కపక్కనే రెండు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు, విద్యార్థులు ఇబ్బందిపడాల్సి వస్తుంది అన్నారు. కావున ప్రభుత్వం మద్యం పాలసీకి వ్యతిరేకంగా పెట్టిన దుకాణాలను తొలగించాలని కోరారు. దీనికి అధికారులు స్పందించి నిరంతరం ప్రజల తిరిగే బలిజిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాలు తొలగించాలని, లేని పక్షంలో ప్రజలను కూడగట్టి ఆందోళన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు భానుమూర్తి, అప్పలస్వామి, కృష్ణ, సన్యాసి, తిరుపతిరావు, అనంతు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

128 మందికి నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి -వీరఘట్టం

మండలంలోని వండువ గ్రామ జంక్షన్ వద్ద గల సాయిబాబా జ్ఞాన మందిరంలో గురువారం విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిబిరంలో నేత్ర వైద్యాధికారి బి.వివేక్ వర్మ 128 మందికి నేత్ర వైద్య తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా 97మందిని ఎంపిక చేసి శస్త్రచికిత్సల కోసం విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ ఆసుపత్రికి తరలించారు. జిల్లా అంధత్వ నివారణా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాంపు జూనియర్ మేనేజర్ సిహెచ్ వెంకటరమణ, క్యాంపు కోఆర్డినేటర్ సిహెచ్ సతీష్, ఆలయ ధర్మకర్త ఎం.సింహాచలం, నేత్ర రోగులు పాల్గొన్నారు. సుధీర ప్రాంతాల నుండి వచ్చిన వారికి భోజన సదుపాయం కల్పించారు.


సమస్యలపై సర్పంచుల ధ్వజం

ప్రజాశక్తి - సీతానగరం

గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారం కావడంలేదని, అలాంటప్పుడు ఈ సమావేశాలు ఎందుకని అధికారులపై పలువురు సర్పంచ్‌లు ధ్వజమెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపిపి బలగ రమణమ్మ అధ్యక్షతన జరిగింది. పలు శాఖల అధికారులు వారి శాఖల ఆధ్వర్యంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. రామవరం, బక్కు పేట, పాపమ్మ వలసలో లోవోల్టాజి సమస్యతో అవస్థలు పడుతున్నామని, తక్షణమే ఈ సమస్యను పరిష్కరించాలని సర్పంచులు సత్యంనాయుడు, గౌరు నాయుడు, మంగమ్మ విద్యుత్‌శాఖ ఎఇని కోరారు. అలాగే ఇళ్లపై విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని పలుమార్లు అధికారులకు తెలియజేసినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. అలాగే ఇ- క్రాప్‌లో రైతులకు పూర్తిస్థాయిలో జరగలేదని, పూర్తి చేయాలని అన్నారు. నేషనల్ ఖాతాలు భూములు సరిచేయాలని ఇప్పలవలస సర్పంచ్ చింతల లక్ష్మణరావు కోరారు. పలు శాఖల పనితీరుపై సర్పంచులు, ఎంపీటీసీలు ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ త్రివిక్రమరావు, తహశీల్దార్ జె.ప్రశాంత్ కుమార్, ఎఒ అవినాష, ఎపిఎం, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలపై నిలదీస్తున్న సర్పంచ్


డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న నల్లనయ్య

క్లీన్ అండ్ గ్రీన్ మన్యం జిల్లాయే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

క్లీన్ అండ్ గ్రీన్ మన్యం జిల్లా యే లక్ష్యంగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ ప్రత్యేక పర్యవేక్షణ అధికారి పి.నల్లనయ్య అన్నారు. గురువారం స్థానిక మున్సిపాలిటీకి వచ్చిన ఆయన ప్రజారోగ్య ఇఇ జ్యోతి, ఇన్చార్జి కమిషనర్ సన్యాసిరావు, డిఇ పి.కిరణ్‌కుమార్‌తో కలిసి డంపింగ్ యార్డ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో గల డంపింగ్ యార్డులోని పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌తో పాటు ఇతర వ్యర్థ పదార్థాలను తరలించేందుకు విశాఖపట్నంలోని తరుణ్ అసోసియేట్‌తో ప్రజారోగ్య శాఖ ఒప్పందం కుదుర్చుకుందని, మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండతో పాటు శ్రీకాకుళం జిల్లాలోని ఆమదాలవలస, ఇచ్ఛాపురం, పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీల్లో ఉన్న అన్ని రకాలైన వ్యర్థ పదార్థాలను తొలగించేందుకు తరుణ్ అసోసియేట్‌తో ఒప్పందం జరిగిందన్నారు. ఈ మేరకు పార్వతీపురంలో డంపింగ్ యార్డ్ లో ఉన్న వ్యర్థ పదార్థాలు తొలగింపునకు సంబంధించి 100x200 స్థలం కేటాయిస్తూ, 40 కెవి ట్రాన్స్ఫరం, బోరు ఏర్పాటు చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ శాఖ డిఇని, ఆ శాఖ అధికారులకు సూచించారు. పనులను త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

ప్రతిభా పాఠశాలలో డిడి తనిఖీ

క్వార్టర్‌ను ఖాళీ చేయాలని ప్రిన్సిపల్‌కు ఆదేశాలు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి - పార్వతీపురం

మండలంలోని జోగింపేట గిరిజన గురుకుల ప్రతిభా పాఠశాల, కళాశాలను గురువారం గిరిజన సంక్షేమ డిడి గయాజుద్దీన్ తనిఖీ చేశారు. ప్రతిభకు పాతర అన్న శీర్షికతో గురువారం ప్రజాశక్తి లో వచ్చిన కథనానికి గిరిజన గురుకుల సొసైటీ అధికారులు స్పందించి ప్రతిభా పాఠశాలను తనిఖీ చేయాలని ఆదేశించడంతో గయాజుద్దీన్ పరిశీలించారు. బదిలీ అయిన ప్రిన్సిపల్ వెంకట నాయుడు క్వార్టర్ ఖాళీ చేయాలని ఆదేశించారు. ప్రస్తుత ప్రిన్సిపల్ ధర్మరాజు స్థానికంగా నివాసం వుండాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేస్తానని తెలిపారు.

బిటి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని కంబర, ఎం.రాజపురం గ్రామాలకు బిటి రహదారుల నిర్మాణ పనులకు గురువారం స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విక్రంపురం గ్రామ సిఎస్‌పి రహదారి నుంచి కంబర వలస గ్రామం మీదుగా కంబర గ్రామం వరకు రూ.1 కోటి వ్యయంతో బీటీ రహదారి నిర్మించనున్నామన్నారు. ఎం.రాజపురం గ్రామ జంక్షన్ సిఎస్‌పి రహదారి నుంచి రాజపురం గ్రామం మీదుగా కత్తుల కవిటి గ్రామం వరకూ రూ.2కోట్లతో పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ పనులు ఉపాధి నిధులతో చేపట్టనున్నామని ఐటిడిఎ ఆధ్వర్యంలో పనులు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఎ నాయకులు పి. కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్ భాస్కర్, గర్భాన సత్తిబాబు, పి. నాగేశ్వరరావు, వి. శ్రీనివాసరావు, సిహెచ్ ఉమామహేశ్వరరావు, తూముల రమేషు తదితరులు పాల్గొన్నారు.

దశమంతపురంలో పల్లె పండుగ

మండలంలోని దశమంతపురంలో గురువారం పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఎ.కుమారస్వామి ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసేందుకు భూమిపూజ చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధి ఎపిఒ జి.సత్యంనాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


కంబరవలసలో బిటిరోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

కురుపాం : మండలంలోని పెదగొత్తిలిలో గురువారం పల్లె పండుగ వారోత్సవాలు సర్పంచ్ టి.లోకనాథం ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి పాల్గొని ఉపాధి హామీ ద్వారా పంచాయతీకి మంజూరైన రహదారులు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జె.రమేష్‌బాబు, మండల ఇంజనీరింగ్ అధికారి పి.నాగేశ్వరరావు, ఎపిఒ పి.బావాజీ, పంచాయతీ కార్యదర్శి బి.చంటి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

మద్యం షాపుపై విచారణ

ప్రజాశక్తి- సీతంపేట

సీతంపేటలో 46 నెంబర్ గల మద్యం షాపు దక్కించుకున్న లబ్ధిదారులపై గురువారం ఆర్ఐ వెంకటేష్ విచారణ చేపట్టారు. 46 నెంబర్ గల షాపు కొండ గొర్రె అన్నపూర్ణ దక్కించుకున్నారు. అన్నపూర్ణ స్థిర నివాసి కాదని ఉన్నత అధికారులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం హడ్డుబంగిలో విచారణ చేసినట్లు ఆర్ఐ తెలిపారు ఈ విచారణలో విఆర్ఒ తదితరులు ఉన్నారు.

రహదారి సమస్య పరిష్కరించండి

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మర్రిపాడు, పూతికివలస, ఈత మానుగూడ పంచాయతీల పరిధిలో 36 గిరిజన గ్రామాల ప్రజలు రహదారి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్టు కూడా లేదని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు, మండల కార్య దర్శి ఎ.భాస్కరరావు విమర్శించారు. 600 మంది విద్యార్థి నిలు చదువు కుంటున్న ఆశ్రమ పాఠశాలకు నిత్యం వారి తల్లి దండ్రులు రాకపోకలకు, నీలకంఠపురం ప్రాంతం ప్రజలు రాకపోకలు కు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ రోడ్డు బాగు చేయమని ఐటిడిఎ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని విమర్శించారు. ఇప్పటికైనా రహదారులను పూర్తి చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.


పాఠశాలను తెరిపించాలని కోరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పాఠశాలను తెరిపించాలని నిరసన

ప్రజాశక్తి- సాలూరు రూరల్

విద్యార్థులు లేరన్న కారణంతో గతకొద్ది నెలల నుంచి మూసివేసిన బొడ్డపాడు పాఠశాలను తెరిపించాలని సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం గ్రామస్తులు పాఠశాల వద్ద నిరసన తెలిపారు. గిరిజన బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కమిటీ సభ్యులు గెమ్మెల బాబయ్య మాట్లాడుతూ పిల్లల సంఖ్య తక్కువగా ఉందన్న కారణంతో గిరిజన ప్రాంతంలో వున్న పాఠశాలను మూసేయడం సరికాదని వెంటనే మూసివేసిన పాఠశాలను తెరిపించాలని డిమాండ్ చేశారు. పాఠశాల మూసి వేయడం వల్ల పిల్లలందరూ పశువులు కాపరులుగా మారిపోతున్నారని తెలిపారు. పాఠశాలను వెంటనే తెరిపించి గిరిజన బిడ్డలకు విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు స్పందించకపోతే విద్యార్థులతో కలసి ఆందోళన పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిదరపు తమ్మయ్య, నరేష్, ఈశ్వరరావు, సన్యాసి, గెమ్మెల సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సుశాంత్ జాన్

రొమ్ము కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం రొమ్ము కేన్సర్ అవగాహన సదస్సును ప్రిన్సిపల్ సుశాంత్ జాన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఏరియా హాస్పిటల్ వైద్యులు హరీష హాజరయ్యారు. ఈ సందర్భంగా బ్రెస్ట్ కేన్సర్ గురించి వివరిస్తూ వ్యాధి లక్షణాలు ఎలా గుర్తించాలో తెలియజేశారు. ముందు జాగ్రత్తలు వచ్చిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలు గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ పై అవగాహన

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ ఫ్రీ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్ అనే అంశంపై ప్రిన్సిపల్ సుశాంత్ జానా అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ పొగాకు, అనుబంధం ఉత్పత్తులు సేవించడం వల్ల మన ఆలోచనలు మన ఆధీనంలో ఉండవని అన్నారు. కావున వాటికి దూరంగా ఉండి తరిమికట్టాలని పిలుపునిచ్చారు.